## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



**సత్తెనపల్లి:** చైత్ర మాస పౌర్ణమి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకారం చేపట్టి పూజలు నిర్వహించారు. స్వామికి విశేష అర్చన చేశారు. సాయంత్రం శ్రీవారికి పౌర్ణమి ఊరేగింపు నిర్వహించారు.

### భక్తిశ్రద్ధలతో అచ్చమాంబ తిరునాళ్ల



**సత్తెనపల్లి:** గుడిపూడిలోని మాతృశ్రీ అచ్చమాంబ తల్లి తిరునాళ్ళ గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మాతృశ్రీ అచ్చమాంబ పుల్లయ్యస్వామి అంకమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని మాతృశ్రీ అచ్చమాంబ పుల్లయ్య స్వామి అంకమ్మ తల్లికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**సత్తెనపల్లి:** స్థానిక 29వ వార్డు నిర్మల నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త జ్యోత్స్నరాణి, ఆయా ఇందిర చిన్నారులతో అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

### పరీక్ష కేంద్రం తనిఖీ



**ముప్పాళ్ళ:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.భవానిశంకర్, అధికారులు గురువారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని వసతులను పరిశీలించారు. తాగునీటి సౌకర్యం, వెలుతురు ఉండాలని సూచించారు. మొత్తం 242 మందికి 240 మంది పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ సిద్ధయ్య తెలిపారు. ఆయనతోపాటుగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ ఒంగోలురాజు ఉన్నారు.

### పలుదేవర్లపాడులో నేడు జగనన్నే మా భవిష్యత్ ప్రారంభం

**ముప్పాళ్ళ:** మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఈనెల 7న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ ఇంటింటి ప్రచారం ప్రారంభం కానుందని వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.జె.ఎం.రామలింగారెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మండలంలోని ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

### 8న మెగా వైద్యశిబిరం

**పెదకూరపాడు:** పెదకూరపాడులోని కాకతీయ కళాశాలలో శనివారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్, కిడ్నీ, కంటి తదితర పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- రాజీవ్‌నగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం



అచ్చంపేటలో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట:** సంక్షేమ పథకాలు దిగ్విజయంగా కొనసాగించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, ఆయనను మళ్లీ సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. గడపగడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రతి కుటుంబం పొందిన సంక్షేమ లబ్ధి గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఇప్పుడు అందే సంక్షేమ పథకాలు గతంలో చంద్రబాబు ఇచ్చాడా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచనున్నట్టు పేర్కొన్నారు. దోసపాటి చెరువును కృష్ణానది నీళ్లతో నింపి, పైపులైన్ల ద్వారా ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేస్తామని, పక్కా డ్రెయిన్లు నిర్మిస్తామని చెప్పారు. రాజీవ్‌నగర్ కాలనీలో రూ.70 లక్షలతో సైడు కాలువలు నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిలో 10శాతం కూడా గత ప్రభుత్వ కాలంలో జరగలేదని ఎమ్మెల్యే వివరించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ రూ.50వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వివిధ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానారాయణ, గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ అంబటి నారాయణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు, ఎంపీటీసీ షేక్ మెహెద్దీన్, వైస్ ఎంపీపీ తెలమేకల నాగరాజు, ఉప సర్పంచ్ జాని, బీసీ సేన కన్వీనర్ బీరువాల జాని, మత్సా శ్రీనివాసరావు, పసుపులేని జాలయ్య, బత్తుల శ్రీనివాసరావు, రామకృష్ణ, చంటి, సుభని, నాగులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు



జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**అచ్చంపేట:** పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల కళాశాలలో గురువారం జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు జరిగాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో కె.కార్తికేయ, తేజకుమార్, ఇస్సాకులు ఎంపికయ్యారు. గ్రీకోరోమన్ విభాగంలో బి.నరేంద్ర, టి.రోహిత్, పి.హనుమత్, డి.ప్రశాంత్‌కుమార్, ఎస్.చంద్రి తదితరులు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో కె.కిరణ్‌కుమార్, గ్రీకోరోమన్ విభాగంలో ఎస్.ప్రసాదరావు, ఎస్.బాలకోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, పి.సుమంత్, ఎ.విజయకుమార్, పి.నవీన్ తదితరులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో జె.కీర్తి, జె.మహేశ్వరి, కె.జాస్సీరాణి, డి.గౌతమి, వి.షాలిని, జి.అఖిల, వి.సంధ్య, ఎం.కీర్తిభాయ్ ఎంపికయ్యారు. విద్యార్థులంతా ఈనెల 9, 10 తేదీలలో చిత్తూరు జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొంటారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రభాకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం, కోచ్ మనోహర్, పీఈటీ జయశ్రీ, పుష్పలత, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

**పెదకూరపాడు:** బాబూ జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో బుధవారం రాత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు, గుంటూరు పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మైనేని నరేంద్ర, కోటేశ్వరరావు, రాజేంద్ర, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాశిం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను వినియోగించుకోండి

**ఎర్రబాలెం(క్రోసూరు):** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పి.కోటయ్య సూచించారు. ఎర్రబాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సిరిచందన పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆస్పత్రి వరకు వెళ్లలేని రోగులకు ఇంటికే వెళ్లి వైద్యం అందించటం గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతుందని వివరించారు. 104 ద్వారా నెలలో రెండు సార్లు ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యురాలు 92 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమలో ఎంపీటీసీ గల్లా లక్ష్మీసుజాత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, నల్లగొండ వెంకయ్య, జనుమల మేరీకుమారి, కందిమల హనుమంతరావు, అమరయ్య, నీరుకొండ చలపతిరావు, ఏపూరి రామాంజనేయులు, గురవయ్య పాల్గొన్నారు.

# అఖిలభారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడిగా జాస్తి



జాస్తి వీరాంజనేయులు

**అమరావతి:** పెదమద్దూరు వాసి జాస్తి వీరాంజనేయులు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఢిల్లీలోని సంస్థ కార్యాలయం నుంచి సంస్థ సెక్రటరీ జనరల్ ఎస్ఎస్ విజయమిశ్రా గురువారం వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం జాస్తి వీరాంజనేయులును సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు.

# విలియం ఎడ్వర్డ్ సేవలు భేష్



వృద్ధులకు అన్నసంతర్పణ చేస్తున్న సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సభ్యులు

**సత్తెనపల్లి:** బాప్టిస్ట్ సంస్థను స్థాపించి సత్తెనపల్లి ప్రాంతంలో క్రైస్తవ మిషనరీ రెవరెండ్ డాక్టర్ విలియం ఎడ్వర్డ్ బాగ్స్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి అధ్యక్షుడు బలిజేపల్లి సురేష్ కుమార్ చెప్పారు. విలియం ఎడ్వర్డ్ బాగ్స్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని 8వ వార్డు క్రిస్టియన్ పేటలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం, అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ పి.డానియల్ బాబు, సంఘ ట్రెజరర్ గుజ్జర్లపూడి రూబెన్, జాయింట్ సెక్రటరీ గంధం మోజెస్, వైస్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ హుస్సేన్, వైస్ ట్రెజరర్ నందిగం వెంకయ్య, కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి సాగర్, చింతపల్లి అజయ్, గుజ్జర్లపూడి యేసేబు, గుజ్జర్లపూడి జాషువా, కొత్తపల్లి రవికుమార్, గుజ్జర్లపూడి దినకర్, కోట దేవరాజు, గుజ్జర్లపూడి జగదీష్, గరికపాటి ఫెర్నాండేజ్, గుజ్జర్లపూడి సందీప్, కెజియాదీప్తి పాల్గొన్నారు.

# కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



సైదారెడ్డి

**అమరావతి:** మునగోడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గణపా సైదారెడ్డి బుధవారం సాయంత్రం కారుఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం ప్రకారం బుధవారం సాయంత్రం సైదారెడ్డిని క్రోసూరు వైపు నుంచి అమరావతి వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో సైదారెడ్డి చేతికి, తలకు బలమైన గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఘటనపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైదారెడ్డి అంటే గిట్టని డీజిల్ మాఫియా సభ్యులు కావాలనే ఈ చర్యకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ కోణంలోనూ విచారించాలని కోరుతున్నారు.

# నడికుడిలో రైళ్లను ఆపాలి

ఏడీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేత



ఏడీఆర్‌ఎంతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**దాచేపల్లి :** నడికుడి రైల్వే జంక్షన్‌లో గతంలో ఆపిన రైళ్లను పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నడికుడి రైల్వే జంక్షన్ పరిశీలనకు వచ్చిన సేఫ్టీ అధికారులను స్థానికులు, సీపీఐ నాయకులు కలిసి గురువారం వినతిపత్రం అందించారు. కరోనాకు ముందు రాత్రి సమయంలో నారాయణాద్రి, చెన్నై, విశాఖ, డెల్టా రైళ్లు ఆగేవని, ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ఆగడం లేదని వివరించారు. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇక నుంచి రైళ్లను ఆపాలని అధికారులను స్థానికులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సేఫ్టీ అధికారులు స్టేషన్‌లోని వివిధ కార్యాలయాలు, రన్నింగ్ రూమ్‌లు, స్టేషన్ పరిసరాలు, రైల్వే ట్రాక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రయాణికుల భద్రతపై ప్రధానంగా దృష్టి సారించాలని స్థానిక రైల్వే అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

# ఏకమొత్తం పన్ను చెల్లింపుతో ఐదుశాతం రాయితీ

**నరసరావుపేట:** ఈ ఆర్థిక సంవత్సరం 2023–24కు సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఏప్రిల్ 30వ తేదీలోగా ఒకేసారి ఏకమొత్తం చెల్లించి ఐదుశాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదవకాశాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా వినియోగించుకుని తన ఆస్తులకు చెందిన రూ.7.46 లక్షలు చెల్లించారన్నారు. ప్రజలు కూడా ఐదుశాతం రాయితీ పొందాలని కోరారు.

# హోరాహోరీగా ఎడ్ల పందేలు



పందెంలో దూసుకుపోతున్న ఎడ్ల జత

**సత్తెనపల్లి:** పట్టణంలోని రఘురాంనగర్‌లో వడ్డవల్లి హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో త్రికోటేశ్వరస్వామి ఆశీస్సులతో హనుమాన్ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల పందేలు గురువారం ఉత్సాహంగా సాగాయి. 15వ వార్డు కౌన్సిలర్ గంట రమణమ్మ నేతృత్వంలో దాతల సహకారంతో పోటీలు హోరాహోరీగా జరిగాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఎడ్ల పందేలకు మొత్తం 16 జతలు వచ్చాయి. జాక్‌పాట్, సీనియర్, పాలదూడల విభాగాల్లో పోటీలు చేపడుతున్నారు. జాక్‌పాట్‌లో గెలిచిన జతకు మన్నెం శివనాగమల్లేశ్వరరావు రూ.30,116, సీనియర్ విభాగంలో గెలిచిన జతకు గంటా సాంబశివరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఏసుబాబు రూ.20 వేలు, పాలదూడల విభాగంలో గెలిచిన జతకు రూ.5,116 నగదు బహుమతులను అందించనున్నారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలను నిర్వహించారు.

# నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్..'



బెల్లంకొండలో 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు



రూపెనగుంట్లలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న భవనం రాఘవరెడ్డి

**బెల్లంకొండ/పెదకూరపాడు/అమరావతి/నకరికల్లు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలులను ప్రతి ఇంటి తలుపు తట్టి వివరిద్దామని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వివిధ గ్రామాల సచివాలయ కన్వీనర్లు, బెల్లంకొండ వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో కలసి 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వలంటీర్లు, గృహ సారథులు శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ దుర్మార్గపు పాలన గురించి, ప్రస్తుత సంక్షేమ సర్కారు పనితీరు గురించి వివరించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద జగనన్న పోస్టర్లను అంటించాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, సర్పంచ్‌లు నరసింహానాయక్, రమణారెడ్డి, బాబూజీ, సైదయ్య, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డుపల్లి రాము, సిరిపురం మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

- పెదకూరపాడు గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్‌లు గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు.
- అమరావతి మండలంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు అమరావతిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని వివరించారు.
- నకరికల్లు మండలం చాగల్లు, రూపెనగుంట్ల గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు గురువారం 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పాల్గొని అవగాహన కల్పించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మండలంలోని కుంలగుంట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్.. నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోనంకి ఆదినారాయణ, అలపర్తి భాస్కరరావు, కాంద్రు బిక్షమయ్య, కంతమనేని చందు, అలపర్తి కృష్ణకుమారి, సూదుల గుంట్ల బ్రహ్మానందం, బద్దుల హరిబాబు, గోగా యలమంద తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ

- రూ.40 లక్షలతో భాగ్యనగర్‌లో కమ్యూనిటీ భవనం నిర్మాణం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి కృషితో అభివృద్ధి పనులు
- వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు



భూమి పూజ చేస్తున్న పురుషోత్తమరావు

**సత్తెనపల్లి:** దళిత కాలనీలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండలం కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు చెప్పారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం(కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ భవన నిర్మాణానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో రూ.20 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, మరో రూ.20 లక్షలు ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరు చేశారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మహాలక్ష్మమ్మ ఎంపీటీసీ కుంభ వీరమ్మ, ఉప సర్పంచ్ కుంభ లక్ష్మి , ధూళిపాళ్ల ఆంధ్ర బ్యాంకు సొసైటీ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, యువజన విభాగం జిల్లా కార్యదర్శి చిలుకా జయపాల్, స్థానిక నాయకులు రాయపాటి కామేశ్వరరావు, ఊటుకూరు నాగేశ్వరరావు, కుంభ గోవిందు, అబ్బూరి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

# ఇకపై విద్యుత్ సమస్యలకు చెక్

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట:** పెదకూరపాడు నియోజకవర్గంలో తలెత్తే విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు పది నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. పెదపాలెంలో గురువారం సాయంత్రం ఆయన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట మండలాల్లో ఒక్కొక్క మండలానికి రెండు చొప్పున, రూ.4 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. పెదపాలెంలో కొండూరు, నిండుజర్ల, మిట్టపాలెం, పెదపాలెం, వేల్పూరు, గ్రంథశిరి గ్రామాలకు కలిపి పెదపాలెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించుకున్నట్టు వివరించారు. ఇది పూర్తయితే విద్యుత్ సమస్య ఉండదని, నిరంతరాయంగా వ్యవసాయ, గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని వెల్లడించారు. విద్యుత్ ఈఈ ఎం.శ్రీనివాసరావు, డీఈఈ జి.సుందరబాబు, ఈఈ ఆపరేషన్ ఎస్.శ్రీనివాసరావు, డీఈఈ టి.శ్రీనివాసరావు, ఏఈ జి.శివకోటిరెడ్డి, తహసీల్దారు పద్మారాణి, పెదపాలెం గ్రామ మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు బొక్కా రవి (ఫైల్)

**సత్తెనపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం కంటెపూడి చేగు దాబా హోటల్ సమీపంలోని మూల మలుపులో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగం గ్రామానికి చెందిన బొక్కా రవి(33), మోదు రమేష్‌లు గుంటూరులోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో క్యాషియర్‌గా, గుమస్తాగా పని చేస్తున్నారు. వారు ఇరువురు విధులు ముగించుకొని తిరిగి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. రవి అక్కడికక్కడే మృతి చెందగా రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు–హైదరాబాద్ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలను నియంత్రించారు. క్షతగాత్రుడు రమేష్‌ను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రవికి భార్య అరుణ, ఆరు నెలల కుమార్తె మధుప్రియ ఉన్నారు. వారం రోజుల కిందటే మధుప్రియకు అన్న పాసన నిర్వహించారు. ఇది ఇలా ఉంటే మృతుడి తల్లిదండ్రులు యల్లమంద, రాణి వృద్ధులు. వీరికి రవి ఒక్కడే కుమారుడు. ఇరువురు అక్కలు ఉండగా ఒకరికి వివాహం అయ్యింది. అందరూ రవిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రవి మృతి చెందడంతో కుటుంబం దిక్కు కోల్పోయింది.